జలజీవన్ మిషన్ బృందం సుడిగాలి పర్యటన

విశాలాంధ్ర - ఆనందపురం: జాతీయ జలజీవన్ మిషన్ సభ్యులు బుధవారం మండలంలో పలు పంచాయతీలలో సుడిగాలి పర్యటన చేశారు. అందులో భాగంగా స్వచ్ఛభారత్ మిషన్ వాటర్ క్వాలిటీ జిల్లా ఇన్చార్జ్ స్వప్న, డిస్ట్రిక్ కోఆర్డినేటర్ పుల్లయ్య ఆధ్వర్యంలో కనమాం, గిడిజాల, గొట్టిపల్లి, వెంకటాపురం గ్రామాల్లో జలజీవన్ మిషన్ పథకాలు పరిశీలించి ప్రజలు అభిప్రాయాలను తెలుసుకున్నారు. నీటి పరీక్షలు శుద్ధి చేసి నీటి నాణ్యత, పరీక్షలు జరిపి మిషన్ పథకాలు అందరికీ అందుతున్నాయో లేదో వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఎస్ ఎస్ఆర్ మూర్తి, ఎంపీడీవో ఎస్.అప్పలనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఏ.తిరుమలరావు, ఈఓపీఆర్డీ రామారావు, పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో రోగులకు అన్నింటా నిరీక్షణే...

ఓపీ దగ్గర నుంచి మందులు తీసుకునే వరకు కష్టాలే
పట్టించుకోని కేజీహెచ్ వైద్యాధికారులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మెరుగైన వైద్యం కోసం వచ్చే రోగులకు కేజీహెచ్ లో అన్నింట నిరీక్షణ ఎదురవుతుంది. ఓపీ చీటీలు దగ్గర గంటల తరబడి నిరీక్షణ, ఓపీలు పొందాక ఆయా నంబర్లలో డాక్టర్ల తనిఖీ గది వద్ద గంటల తరబడి నిరీక్షణ, పరీక్షలు రాస్తే అక్కడ మరింత నిరీక్షణ తప్పడం లేదు. అన్నింట నిరీక్షణ రోగులను మరింత కృంగదీసి నీరసించి పోయేలా చేసి ప్రభుత్వ ఆసుపత్రులు అంటే విరక్తి కలిగేలా వ్యవహరిస్తున్న తీరుపై రోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతమంది కలెక్టర్లు చెప్పిన, మంత్రులు చెప్పిన, ఎమ్మెల్యేలు చెప్పిన వైద్యుల తీరు, సిబ్బంది అలసత్వం మారడం లేదు. కూటమి ప్రభుత్వంలో కూడా వైద్య సేవలు పేద ప్రజలకు అందని ద్రాక్షగానే మిగిలిపోతుందని అనేకమంది అభిప్రాయపడుతున్నారు.

పెద్ద ఆసుపత్రిలో రోగుల కష్టాలకు కొదవే లేదు

తమ ఆరోగ్యాలను బాగు చేసుకోవాలని గంపెడాశతో ఉత్తరాంధ్ర జిల్లాలకు పెద్ద ఆసుపత్రిగా ఉన్న కేజీహెచ్‌కు వచ్చే రోగులకు ఓపీ పెద్ద నిరీక్షణగా మారింది. ఉదయం ఎనిమిది గంటలకే ఓపీ కేంద్రాల వద్ద బారులు తీరిన రోగులకు గంటల తరబడి నిరీక్షణ పరిస్థితి నెలకొంది. స్మార్ట్ ఫోన్లో ఆధార్ నెంబర్తో ఓపీ రిజిస్ట్రేషన్ రోగుల పాలిట శాపంగా మారింది. ప్రభుత్వ ఆసుపత్రికి పేదలు, నిరక్షరాస్యులు, వృద్ధులు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు. వారికి యాప్‌ల పేరిట అధికారులు యాతన పెట్టిస్తున్నారు. సకాలంలో ఓపి చీటీ అందక అనేకమంది రోగులు వెనుతిరుగుతున్నారు. పురుషులకు, స్త్రీలకు వేరుగా రెండు కేంద్రాలు పెట్టినప్పటికీ క్యూలో గంటలు తరబడి నిలబడాల్సిన రోగులకు నీరసం వచ్చి అక్కడే పడిపోతున్నారు. ఓపీ చీటీలు ఇచ్చే సిబ్బంది దురుసు ప్రవర్తన కూడా రోగులకు ఇబ్బందికరంగా మారింది. ఆన్లైన్ రిజిస్ట్రేషన్ యాప్ ద్వారా క్రమసంఖ్య చెపితేనే ఓపీ చిట్టి ఇస్తామని చెప్పడంతో అనేకమంది రోగులు నరకయాతన పడాల్సిన పరిస్థితి నెలకొంది. అనేక సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు వైద్యుల పరీక్షల కన్నా, ఓపీ చీటీ పొందడమే పెద్ద పరీక్షగా మారిపోయింది. గతంలో సులభ తరంగా ఓపీ చీటీ కేంద్రాలకు వెళ్లి క్యూలో నిలబడి పేరు, వయసు చెబితే ఆరోగ్య సమస్య ఆధారంగా వివిధ ఓపీలు చూసే వైద్యుల గదులకు వెళ్లి క్యూలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. తమ ఆరోగ్య సమస్యలు చెప్పుకోవడానికి వచ్చిన రోగులకు అక్కడ వైద్యులు లేకపోవడంతో కేవలం పీజీ విద్యార్థులతోనే వైద్య సలహాలు, తనిఖీలు నిర్వహించి సంబంధిత పరీక్షలు

చేసుకోవాలని, మందులు చీటీలు రాసి ఇచ్చేస్తున్నారని, సరైన వైద్య సేవలు అందడం లేదని అనేక మంది రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేజీహెచ్‌లో సుమారు 300 మంది వైద్యులు వివిధ విభాగాల్లో ఉన్నప్పటికీ, అనేకమంది వైద్యులు, హెచ్ఓడీలు ఓపీ గదులకు రాకపోవడం, రోగలను ప్రత్యక్షంగా చూడకపోవడం, కేవలం జూనియర్ డాక్టర్లతోనే వైద్య సేవలు సరి పెట్టేస్తున్నారని రోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది రూపాయలు జీతాలు తీసుకుంటున్న వైద్యులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలకే మొగ్గు చూపుతున్నారు తప్ప, పెద్ద ఆసుపత్రిలో అధిక సమయం కేటాయించడానికి సుముఖత చూపడం లేదని కొంతమంది రోగులు అంటున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల మారుమూల గ్రామాల నుండి ఎంతో ఆశతో కేజీహెచ్ ఆసుపత్రికి వైద్య సేవ కోసం వస్తున్నామని, ఇక్కడ వైద్య సేవలు అందాలంటే చాలా నరకయాతన పడాల్సి వస్తుందని రోగులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఎక్స్ రే వద్ద, స్కానింగ్ వద్ద, రక్త పరీక్షల వద్ద కూడా రోగులకు నిరీక్షణ తప్పడం లేదు. ఇక మందులు సరఫరా చేసే కేంద్రాల వద్ద కూడా నిరీక్షణ ఉంటుందని, కొన్ని మందులు సరఫరా లేవంటూ ఇవ్వడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక ఆసుపత్రిలో అడ్మిట్ అయిన రోగులకు, వారి బంధువుల కష్టాలు వర్ణనాతీతం. రక్త పరీక్షలు పేరిట వివిధ స్కానింగ్ పేరిట కేజీహెచ్ అంతటా తిరగాల్సిన పరిస్థితి నెలకొందని, సర్జరీలు పేరిట అవసరం లేకపోయినా బంధువుల దగ్గర నుండి రక్తం ఇవ్వాలని వైద్యులు ఆదేశాలు జారీ చేస్తున్నారని అనేకమంది రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

10 టీవీ బ్యూరో చీఫ్ జార్జికి ఏయూ డాక్టరేట్

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయం జర్నలిజ విభాగ పరిశోధక విద్యార్థి, 10 టీవీ బ్యూరో చీఫ్ భూపతి జార్జి ఫెర్నాండేజ్‌కు ఆంధ్ర యూనివర్సిటీ డాక్టరేట్ లభించింది. ఆ విభాగ ప్రొఫెసర్ చల్లా రామకృష్ణ పర్యవేక్షణలో ఆయన పరిశోధనలు సాగాయి. సమాచార హక్కు చట్టం - పత్రికల పాత్ర - మీడియా ప్రచురించిన కథనాలు అనే అంశంపై జార్జి ఫెర్నాండేజ్ పరిశోధనలు చేశారు. జార్జి చేసిన పరిశోధన ఫలితాలను పరిశీలించి డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ చల్లా రామకృష్ణ చేతుల మీదుగా బుధవారం జార్జికి డాక్టరేట్‌ను అందజేసారు. అనంతరం జర్నలిజంలో డాక్టరేట్ అందు కున్న జార్జ్‌ను ఆంధ్రా యూని వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్ ఆచార్య జి.శశిభూషణరావు అభినందిం చారు. జార్జికి డాక్టరేట్ ప్రధానం కావడం పట్ల వర్సిటీలోని పలువురు ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

ప్రభుత్వం ఆర్థిక నేరాలను అరికట్టాలి

విశాలాంధ్ర - మల్కాపురం: ప్రజలను రక్షించడానికి ఆర్థిక నేరాలను అరికట్టాలని, దోపిడీని నివారించాలని, కార్మిక హక్కులను కాపాడాలని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నూతన ఆర్థిక విధానం 1991- తీరుతెన్నులు అనే అంశంపై జరిగిన సదస్సులో ఆమె ప్రసంగించారు. నూతన ఆర్థిక విధానం వల్ల ప్రైవేటీకరణ, సరళీకరణ, ప్రపంచీకరణ విధానాలు ఆర్థిక వ్యవస్థ రూపురేఖలను మార్చి వేసాయని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు లేకుండా చేసాయని అన్నారు. ఆర్థిక అసమానతలు పెరిగి సమ సమాజం ఒక నినాదంగానే మిగిలిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నూతన ఆర్థిక విధానం వల్ల కుటీర, గృహ పరిశ్రమలు మూతపడ్డాయని, సాంఘిక న్యాయం అడుగంటిందని, వీటిని నివారించడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని అన్నారు. కార్యక్రమంలో అర్థశాస్త్ర అధ్యాపకుడు బి.పి.రాజు, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు అనసూయా దేవి, అర్థశాస్త్ర అధ్యాపకులు సలోమి తదితరులు పాల్గొన్నారు.

పార్కుగా ప్రహ్లాదపురం చెరువు గట్టు

విశాలాంధ్ర - పెందుర్తి: జీవీఎంసీ 93వ వార్డు ప్రహ్లాదపురంలోని సర్వే నెంబర్ 133/1 లో గల 5.74 ఎకరాల విస్తీర్ణం గల చెరువు గట్టును పార్కుగా మార్పు చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు స్థానిక కార్పొరేటర్ రాపర్తి కన్నా తెలిపారు. బుధవారం ఉదయం టీడీపీ వార్డు అధ్యక్షులు గంగవరపోలు, కార్యదర్శి పైడిరాజు, సీనియర్ నాయకులు కర్రి నూకరాజు, టీపీఓ తేజేశ్వరరావు, సర్వేయర్ అప్పన్న, టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు షర్మిల, యమున, శ్రీదేవి, శివ, అచ్చం నాయుడు, శ్రీనివాస్ తదితరులతో కలిసి ఆ ప్రాంతాన్ని సందర్శించిన కార్పొరేటర్ చెరువు గట్టును సర్వే చేయించి వివరాలు నమోదు చేయించారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ చెరువుగట్టు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి జిమ్ ఐటమ్స్ సమకూర్చనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు టీడీపీ యువత అధ్యక్షుడు దాసరి బుజ్జి, గంగ నూకరాజు, గంగ విజయ్, పవర్ స్టార్ రాము, గంట్ల కనకరాజు, బలిరెడ్డి శ్రీను, కర్రి వెంకట్, సంతు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణలో ఎన్.జి.ఓ.లు భాగస్వామ్యం కావాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రజారోగ్య పరిరక్షణకు ఎన్.జి.ఓ.లు సహకరించాలని, వ్యాధులు ప్రబలకుండా తీసుకునే చర్యల్లో భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆయా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను ఉద్దేశించి పేర్కొన్నారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో బుధవారం సాయంత్రం జిల్లాలోని వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలెక్టరేట్ మీటింగ్ హాలులో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, ఇతర సీజనల్ వ్యాధుల నివారణకు జిల్లాలో పలు రకాల చర్యలు చేపడుతున్నామని, ఇప్పటికే అన్ని విభాగాల అధికారులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశామని కలెక్టర్ వారికి వివరించారు. జిల్లా యంత్రాంగం చేపట్టే చర్యల్లో జిల్లాలోని స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం కావాలని, అటు ప్రజలకు, ఇటు అధికార యంత్రాంగానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్ట్స్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన వీసీ

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలలోని పలు విభాగాలను ఇంచార్జి వీసీ ఆచార్య జి.శశిభూషణ రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. బుధవారం ఉదయం ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.నరసింహా రావుతో కలిసి ఆర్ట్స్ కళాశాలలోని ఆంత్రపాలజీ, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, ఇంగ్లీషు, లైబ్రరీ సైన్స్, ఫిలాసఫీ తదితర విభాగాలలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది విధులకు హాజరవుతున్న విధానం ప్రత్యక్షంగా గమనించారు. ఆర్ట్స్ కళాశాల భవనంలో నూతనంగా లిఫ్ట్ ఏర్పాటు, మరమ్మత్తులు చేపట్టడం, ఫర్నీచర్ ఏర్పాటు తదితర అంశాలను ప్రిన్సిపాల్ స్వయంగా వీసీ దృష్టికి తీసుకువెళ్లారు. ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి వాటిని ఏర్పాటు చేస్తామని వీసీ తెలిపారు. తరగతులు పటిష్టంగా నిర్వహించాలని బోధన సిబ్బందికి వీసీ శశిభూషణ రావు సూచించారు.

ఏఐటీయూసీలో పలువురు ఆటోడ్రైవర్లు చేరిక

విశాలాంధ్ర - విశాఖ సిటీ: సీతమ్మధార ఏఎస్ఆర్ నగర్‌లో కమ్యూనిటీ హాల్ వద్ద జరిగిన శ్రీ దుర్గా గణపతి ఆటో స్టాండ్ డ్రైవర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు ఆటో డ్రైవర్లు ఏఐటీయూసీలో చేరారు. అనంతరం విశాఖ జిల్లా ఆటో యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి పదాల గోవింద్ మాట్లాడుతూ డ్రైవర్లంతా సోదర భావంతో ఐక్యంగా ఉండాలని, ఖాకీ యూనిఫామ్‌లు ధరించాలని, ఆటోలకు ఫిటినెస్ సర్టిఫికెట్లు పక్కాగా ఉండాలని, ఆటోలో పరిమితికి మించి పాసింజర్లను ఎక్కించకూడదని అన్నారు. నగరంలో ఆటోలకు పార్కింగ్ స్థలాలకై పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటుకై డ్రైవర్లు పోరాటాలకు సిద్ధమవ్వాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చంటి, నాని, రవీందర్ రెడ్డి, గణేష్, రాజ్ కుమార్, నాయుడు, సన్నీ, డీజే. రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీలో వార్డు కమిటీలు పునరుద్ధరించండి

కొత్త కమిషనర్‌కు వినతి విజ్ఞప్తి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: 73, 74 రాజ్యాంగ సవరణ ప్రకారం జీవీఎంసీలో వార్డు కమిటీలు పునరుద్ధరించాలని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్‌ను విదసం నేతలు కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్‌ను బుధవారం మర్యాద పూర్వకంగా కలసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సంఘం కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో జీవీఎంసీ నిర్వీర్యం అయిపోయి టీడీఆర్ అక్రమాలకు నిలయంగా మారిపోయిందని, ప్రక్షాళనకు మీ వంతు కృషి చేయాలన్నారు. స్థానిక సంస్థల రాజ్యాంగ పరమైన హక్కులు, నిదులు, విధులకు సంబంధించి జరిగిన రాజ్యాంగ సవరణ 73, 74 ప్రకారం పురపాలక సంస్థల్లో వార్డు స్థాయిలో కార్పొరేటర్ నాయకత్వంలో వార్డు కమిటీలు ఏర్పాటు చేయాలని నిబంధనలు చెబుతున్నాయన్నారు. గత ప్రభుత్వం ఈ నిబంధనలు తుంగలోకి తొక్కి జీవీఎంసీలో 2021 నుండి వార్డు కమిటీలు ఏర్పాటు చేయలేదన్నారు. వెంటనే కార్పొరేటర్ నేతృత్వంలో వార్డు స్థాయిలో కనీసం 15 మందితో (50 శాతం మహిళలు, ఎస్సి ఎస్టీ బీసీ కోటా ప్రకారం) వార్డు కమిటీలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ వార్డు కమిటీలు ఏర్పాటుకు పై వారి అనుమతితో చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాజి ఓంకార్, సోదాదాసి సుధాకర్, బులా భాస్కరరావు, రవి శేఖర్, ఎస్.నూకరాజు, గొడి వేంకటేశ్వరరావు, స్వామి సంతోష్ కుమార్, మందా శ్రీనివాస్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గీతం పట్టభద్రుల దినోత్సవం

విశాలాంధ్ర - మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం పట్టభద్రుల దినోత్సవాన్ని (గ్రాడ్యుయేషన్‌డే) బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టభద్రుల దినోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎక్సైరన్ గ్రూప్ మాజీ మేనేజింగ్ డైరెక్టర్ శిల్పాగుప్తా హాజరై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. వినూత్న ఆలోచనలతో అవకాశాలను విద్యార్థులు చేజిక్కించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రపంచం నేడు ఎదుర్కొంటున్న పలు సవాళ్ళకు పరిష్కారం చూపాలన్నారు. గీతం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ గీతం విశ్వవిద్యా లయంలో వివిధ కోర్సులలో ప్రవేశం పొందిన విద్యార్థులకు 35.23 కోట్ల రూపాయల మేర స్కాలర్‌షిప్‌లను అందించి ప్రోత్సహించిందని అలాగే 55 మంది పరిశోధకలకు మూర్తి రీసెర్చి ఫెలోషిప్‌లను అందించామన్నారు. దేశంలోని ప్రముఖ సంస్థల నుంచి 63 పరిశోధన ప్రాజెక్టులను నిర్వహిస్తున్నామన్నారు. గీతంలో జరుగుతున్న అధ్యయనాలను గుర్తిస్తూ భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం రూ.13.43 కోట్లతో పర్స్ ప్రోగ్రామ్ (ప్రమోషన్ ఆఫ్ యూనివర్సిటీ రీసెర్చి అండ్ సైంటిఫిక్ ఎక్సలెన్స్) మంజూరు చేసిందని వెల్లడించారు. గీతం రిజిస్ట్రార్ డాక్టర్ డి.గుణశేఖరన్ అధ్యక్షతన జరిగిన పట్టభద్రుల దినోత్సవంలో 3 వేల మందికి పైగా విద్యార్థులు పట్టాలను అందుకున్నారు. గీతం పట్టభద్రుల దినోత్సవంలో గీతం ఉపాధ్యక్షుడు ఎమ్.గంగా ధరరావు, కార్యదర్శి ఎమ్.భర ద్వాజ, జిమ్‌సర్ ప్రోవైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి పాల్గొన్నారు. విశాఖ ప్రాంగణం నుంచి 2023-24 విద్యా సంవత్సరానికి ఇంజనీరింగ్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, లా, ఇంటర్నేషనల్ బిజినెస్, ఎంబిఎ, బిబిఎమ్, బికామ్ వంటి కోర్సులు పూర్తి చేసిన 2818 మంది పట్టభద్రులకు డిగ్రీలను, 99 మంది పరిశోధక విద్యార్థులకు డాక్టరేట్‌లను (పి హెచ్‌డి), అత్యుత్తమ ప్రతిభను కనబరిచినందుకు 44 మంది విద్యార్థులకు బంగారు పతకాలను పట్టభద్రుల దినోత్సవంలో అందజేశారు.

బడ్జెట్‌లో విశాఖ స్టీల్‌కు మొండి చేయి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: బడ్జెట్‌లో విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు న్యాయం చేస్తారని కార్మికులు, ఉద్యోగులు ఎంతగానో ఎదురు చూశారని కానీ మొండి చేయే మిగిలిందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న దీక్షలు 1259వ రోజుకు చేరుకున్నాయి. వీరిని ఉద్దేశించి సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, ఇది పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిపేందుకు బడ్జెట్ సపోర్టుగా 5000 కోట్లు ఇవ్వాలని, స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని కేంద్ర స్టీల్ మంత్రి శ్రీ కుమారస్వామి గారు స్టీల్ ప్లాంట్ సందర్శన సందర్భంగా ఆయనకు వివరించామని అన్నారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగం పట్ల తన పాత విధానాన్నే కొనసాగిస్తుందని ఆయన తీవ్రంగా విమర్శించారు. కార్యక్రమంలో స్టీల్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, స్టీల్ సీఐటీయూ అధ్యక్షులు వైటి దాస్, సీనియర్ నాయకులు ఎన్.రామారావు, స్టీల్ సీఐటీయూ ప్రతినిధులు శ్రీనివాసరాజు, యు.వెంకటేశ్వర్లు, గంగాధర్, నీలకంఠం, టివికె రాజు, శివ, సంతోష్ రాజు, మహేష్, విడివి పూర్ణచంద్రరావు, రాజా తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు...?

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీనృసింహ స్వామివారి దేవస్థానంలో అగ్నిమాపక రక్షణ చర్యలు ఎక్కడా కనబడటం లేదు. జరగరాని ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరంటూ భక్తులు ప్రశ్నిస్తున్నారు. అగ్ని ప్రమాదం జరిగితే పెద్ద మొత్తంలోనే ప్రాణనష్టం వాటిల్లే అవకాశం ఉంది. తమ దాకా వస్తే గాని నొప్పి తెలి యదన్నట్టు అగ్ని ప్రమాదం జరిగేదాక ఫైర్‌సేఫ్టి మెజర్స్ తీసుకునేలా కనిపించడం లేదు. హొజ్‌రిల్స్, డ్రమ్స్ అందుబాటులో ఉంచాలి. పైనుంచి కిందకు వచ్చే విధంగా అగ్ని మాపక పరికరాలను సమకూర్చుకోవాల్సి ఉంది. కానీ ఈ పరికరాలను అందుబాటులో ఉంచడం లేదని తెలుస్తోంది. ముఖ్యంగా ప్రధాన దేవాలయం, స్వామివారి నిత్య నైవేద్యాలు తయారి చేస్తున్న (పాకశాల) వంటశాల, నిత్యాన్నదాన భవనంలో ప్రసాదాలు, నిత్యాన్న దానంకు కావలసిన తయారి, దేవస్థానంకు సంబంధించిన కేంద్ర గోదాములు (ముడిసరుకులు) నిల్వ ఉంచుతున్న ప్రదేశం కూడాను. గతంలో ఏర్పాటు చేసిన ఫైర్ సేఫ్టి పైపులు, తదితర పరికరాలు నిర్వీర్యమయ్యాయి. పేరుకు మాత్రం ఫైర్ ఏస్టింగిషర్స్ (సిలిండర్) దిష్టి బొమ్మల్లా దర్శనమిస్తాయి. అయితే ఆ ఫైర్ ఎస్టింగిషర్ ఎలా ఉపయోగించాలో ఎవరికి తెలియదు. కానీ అకస్మాత్తుగా ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే అగ్నిమాపక పరికరం ఎలా ఉపయోగించాలో తర్ఫీదు (ట్రైనింగ్) కూడా ఇక్కడ అధికారులు ఏర్పాటు చేయలేదు. ఏ కొద్దిపాటి ప్రమాదం జరిగినా ఆ సిలిండర్ (ఫైర్ ఏస్టింగిషర్స్) ఎలా ఉపయోగించాలో అధికారులకే తెలియదు. ఇక సిబ్బంది విషయం చెప్పనవసరం లేదాయె...!. నగరంలో ఉన్న ఫైర్ అధికారులు కూడా అధికారులకు కనీసం సలహా, సూచనలు చేస్తున్నట్లు దాఖలాలు లేవు. ఎంతసేపు ఫైర్ అధికారులు, సిబ్బంది తమ పైస్థాయి అధికారుల దర్శనాలతో బిజి అవుతున్నారు. సంవత్సరానికి ఒక్కసారి అగ్నిమాక వారోత్సవాలు వస్తున్నప్పటికీ ఎన్నడూ మాక్ డ్రిల్ చేసిన దాఖలాలు లేవు. గతంలో ఆలయ ప్రాంగణంలోను, ప్రస్తుత నిత్యాన్నదాన భవనంలో ప్రసాదాల తయారి వద్ద, అన్నప్రసాదం తయారి వద్ద, షాపింగ్ కాంపెక్స్‌ల వద్ద ప్రమాదం జరిగేందుకు అవకాశాలెక్కువ. కొండపైన, కొండ క్రింద దుకాణ నిర్వాహకులకు గ్యాస్ సిలిండర్ వాడరాదు అన్న నిబంధనలు ఉన్నప్పటికీ గ్యాస్ సిలిండర్ వాడుక వలన సిలిండర్ పేలి పలుమార్లు దుకాణాలతో పాటు అందులో ఉన్న సరుకు కాలి బూడిదైన సంగతి భక్తులకు, పాఠకులు తెలిసిందే. పైన తెలిపిన ప్రదేశాల్లో పలుమార్లు కుక్(వంటలు వండేవారు)లు ఇటువంటి ప్రమాదలు చవిచూశారు. అదేవిధంగా కోవిడ్ సమయంలో అన్నదాన భవనంలో ఉన్న కేంద్ర స్టోర్స్‌లో షార్ట్ సర్క్యూట్ వలన సింహాద్రి అప్పన్న ఖజానాకు లక్షల రూపాయలు నష్టం వాటిల్లిన సంగతి పాఠకులకు విధితమే. ఏ ప్రమాదమైనా చెప్పి రాదు, అంత కంటే ముందు మనం ప్రమాదం జరగకుండా ఉండటానికి తీసుకోవలసిన రక్షణ చర్యలు అధికారులు తీసుకుంటారని భక్తులు ఆ సింహాద్రప్పన్నను కోరుకుంటున్నారు.

స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ పోలీసుల విస్తృత తనిఖీలు

విశాలాంధ్ర - తగరపువలస: విశాఖపట్నం సిటీ పోలీసు కమిషనర్ శంఖబ్రతా బాగ్చి ఆదేశాలమేరకు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో బి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ సుబ్బారావు ఆధ్వర్యంలో భీమిలి క్రాస్ రోడ్డు వద్ద విస్తృత తనిఖీలు చేశారు. గంజాయి, అక్రమ మద్యం, ఇతర మత్తుపదార్థాల నివారణకు గాను వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వి.రామకృష్ణ, కెవిబి రావు, దేముడురాజు, వహీదా, రాణీ పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE AT: VISAKHAPATNAM
E.A.435/2021 in
E.P.313/2017 in O.S.1//2015
Between:
Sri Polisetti Haranadh Muralidhar ...Claim Petitioner
And
1) Tetalli Rama Reddy
2) Polisetty Giridhar Gopal ...Respondents
NOTICE
To,
R-2: **Polisetty Giridhar Gopal**, S/o. late P.L. Sanada Rao, Hindu, aged 62 years, D.No.9-19-20/A, CBM Compound, Visakhapatnam.
Please take notice that the above named Claim Petitioner filed the above E.A. seeking to declare his claim over the E.P. schedule property and for other reliefs and the above matter stands posted to **06-08-2024** for your appearance. Both of you have to attend either in person or through your counsel on that day at about **10:30 A.M.** in the above stated Hon'ble Court, failing which the matter will be decided in your absence.
(By Order of the Hon'ble Court)
V.S. PAVAN,
Advocate for Claim Petitioner,
Visakhapatnam. **Cell: 9848119594**

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE AT: VISAKHAPATNAM
E.A.1170/2019 in
E.P.78/2014 in ARC.24/2013
Between:
Dasyam Madhusudhana Rao ...Petitioner/Claim Petitioner
And
M/s. Sriram City Union Finance Limited, Rep. by its Manager and 3 others ...Respondents
NOTICE
To,
R-2: **Sri Dasyam Srinivasa Rao**, S/o. late Raghava Rao, Hindu, aged about 50 years, R/at D.No.2-15-46/1, Sector-9, M.V.P. Colony, Visakhapatnam.
R-3: **Smt. Dasyam Lakshmi**, W/o. Srinivas, Hindu, aged about 46 years, R/at D.No.2-15-46/1, Sector-9, M.V.P. Colony, Visakhapatnam.
Please take notice that the above named Claim Petitioner filed the above E.A. seeking to declare his claim over the E.P. schedule property and for other reliefs and the above matter stands posted to **06-08-2024** for your appearance. Both of you have to attend either in person or through your counsel on that day at about **10:30 A.M.** in the above stated Hon'ble Court, failing which the matter will be decided in your absence.
(By Order of the Hon'ble Court)
V.S. PAVAN,
Advocate for Claim Petitioner,
Visakhapatnam. **Cell: 9848119594**

శాంసంగ్ గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6, జెడ్ ఫ్లిప్ 6కి అద్భుతమైన స్పందన

విశాలాంధ్ర- విశాఖపట్నం: భారతదేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన శాంసంగ్ , తమ ఆరవ తరం ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్‌లు - గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6 మరియు గెలాక్సీ జెడ్ ఫ్లిప్ 6 కోసం రికార్డ్ స్థాయిలో ముందస్తు బుకింగ్ లను అందుకున్నట్లు ప్రకటించింది. మొదటి 24 గంటల్లో, గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6 మరియు జెడ్ ఫ్లిప్ 6 ప్రీ-ఆర్డర్‌లు మునుపటి తరం ఫోల్డబుల్‌లతో పోలిస్తే 40 శాతం అధికంగా జరిగాయి, తద్వారా కొత్త జెడ్ సిరీస్ భారతదేశంలో అత్యంత విజయవంతమైనదిగా నిలిచింది. గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6 మరియు జెడ్ ఫ్లిప్ 6 ప్రీ-ఆర్డర్‌లు ప్రపంచంలోని ఇతర దేశాలతో పాటు భారతదేశంలో జూలై 10న ప్రారంభించబడ్డాయి. కొత్త స్మార్ట్‌ఫోన్‌లు, ఇటీవల విడుదల చేయబడిన ఎకోసిస్టమ్ పరికరాలతో పాటు - గెలాక్సీ వాచ్ అల్ట్రా , గెలాక్సీ వాచ్ 7, గెలాక్సీ బడ్స్ 3 ప్రో మరియు గెలాక్సీ బడ్స్ 3 జూలై 24, 2024 నుండి భారతదేశంలో విక్రయించబడతాయి. "భారతదేశంలో మా కొత్త ఫోల్డబుల్స్ - గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6 మరియు గెలాక్సీ జెడ్ ఫ్లిప్ 6 కోసం వినియోగదారుల ప్రతిస్పందనతో మేము సంతోషిస్తున్నాము. కొత్త ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్‌ల కోసం ప్రీ-ఆర్డర్‌లలో 1.4 పెరుగుదల కనిపించింది. కొత్త టెక్నాలజీని అత్యంత వేగంగా స్వీకరించేవారిలో భారతీయ వినియోగదారులు ఉన్నారని ఇది చూపిస్తుంది. మా కొత్త ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్‌లు, ఇప్పుడు వాటి ఆరవ తరంలో ఉన్నాయి,

గెలాక్సీ ఏఐ యొక్క తదుపరి అధ్యాయాన్ని తెరిచి, వినియోగదారు అనుభవాన్ని కొత్త శిఖరాలకు తీసుకువెళ్తాయి , కమ్యూనికేషన్‌లు, ఉత్పాదకత మరియు సృజనాత్మకత అంతటా ప్రత్యేకమైన మొబైల్ అనుభవాలను అందిస్తాయి. గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6 మరియు గెలాక్సీ జెడ్ ఫ్లిప్ 6 విజయం భారతదేశంలో మా ప్రీమియం సెగ్మెంట్ నాయకత్వాన్ని ఏకీకృతం చేయడంలో మాకు సహాయం చేస్తుంది" అని శాంసంగ్ ఇండియా ఎంఎక్స్ బిజినెస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాజు పుల్లన్ అన్నారు.

అయ్యంకి అందరికీ ఆదర్శనీయులు

విశాలాంధ్ర - మల్కాపురం: గ్రంథాలయ ఉద్యమ పిత, స్వాతంత్ర సమరయోధుడు అయ్యంకి వెంకట రమణయ్య ప్రజలందరికీ ఆదర్శనీయుడని ప్రముఖ కవ కె.సత్తిరాజు అన్నారు. స్థానిక మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో అయ్యంకి వెంకట రమణయ్య జయంతి సందర్భంగా ఆయనకు నివాళి అర్పించారు. అయ్యంకి వెంకటరమణయ్య గ్రంథాలయ ఉద్యమానికి, పత్రికా రంగానికి ఎనలేని సేవ చేశారని అన్నారు. జయంతి ఉత్సవంలో పాల్గొన్న జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయా దేవి మాట్లాడుతూ ప్రజల విజ్ఞానానికి మూలమైన గ్రంథాలయాలను ఏర్పాటు చేసి విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణానికి అయ్యంకి వెంకట రమణయ్య కృషి చేశారని అన్నారు. ప్రతి గ్రామంలోనూ గ్రంథాలయాన్ని నెలకొల్పి, గ్రామాల అభివృద్ధికి, చైతన్యానికి ఆయన కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో ఆయన జీవిత విశేషాలను గురించి జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.వి.ఎస్. భాగ్యలక్ష్మి, సెయింట్ ఆన్స్ కళాశాల గ్రంథాలయాధికారి జి. శిరీష, మల్కాపురం శాఖా గ్రంథాలయాధికారి వి.అజయ్ కుమార్ ప్రసంగించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు. అనంతరం గ్రంథాలయాధికారులైన వి.అజయ్ కుమార్ ను మరియు జి. శిరీషను స్థానికులు సన్మానించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాల అభివృద్ధికి మరియు ప్రచారానికి కృషి చేస్తున్న.సత్తిరాజును అంతా ఘనంగా సత్కరించారు.

బిజెపిలో పలువురు కార్యకర్తలు చేరిక

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: భారతీయ జనతా పార్టీ విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గంలో బుధవారం పెద్ద ఎత్తున కార్యకర్తలు వివిధ రాజకీయ పార్టీల నుంచి బిజెపిలో చేరారు. స్థానిక 29వ వార్డు, 30వ వార్డు, 37వ వార్డు నుండి యువకులు మహిళలు దాదాపు 150 మంది పార్టీలో చేరి సభ్యత్వం తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమం విశాఖ జిల్లా పార్టీ కార్యాలయంలో విశాఖ పార్లమెంటు జిల్లా అధ్యక్షులు మేడపాటి రవీంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో నీలాపు విజయానంద రెడ్డి, శ్రీకాకుళం జిల్లా ఇంచార్జ్ ఎస్వీఎస్ ప్రకాష్ రెడ్డి, పార్వతీపురం జిల్లా ఇన్చార్జి, సారిపల్లి రామ్మోహన్, పార్లమెంట్ నియోజకవర్గం, దామోదర్ యాదవ్, ఎస్వీఎస్ దిలీప్ వర్మ, పాలిమేర శ్రీనివాసరావు, ఎస్.దానేశ్వరరావు నలుగురు జిల్లా ప్రధాన కార్యదర్శులు చొక్కకుల రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు, ఉమ్మడి సుజాత, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు, రోహిణి వత్సవాయి, రాష్ట్ర మహిళా మోర్చ ఉపాధ్యక్షురాలు, శ్రీ దేవర చంద్రశేఖర్ 29వ వార్డు అధ్యక్షులు , విహెచ్. రాజబాబు, మైనార్టీ మోర్చా నాయకులు, ఎల్.. జగదీశ్ , దశమంతల సుశీల, మంజుల, జీ .రామా, తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో అన్ని విభాగాలను పరిశీలించిన జీవీఎంసీ కమిషనర్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జీవీఎంసీలో అధికారులు, ఉద్యోగులు పరిశుభ్రమైన వాతావరణంలో, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయం లో అన్ని విభాగాలను, సెల్లార్ ఫ్లోర్ లో బ్యాటరీ కార్ పార్కింగ్ ఆవరణ, సౌకర్య, సచివాలయం కేంద్రం మొదలైన విభాగాలను, ఉన్నతాధికారుల గదులను అధికారులతో కలసి పరిశీలించారు. ఈ పరిశీలనలో కమిషనర్ మాట్లాడుతూ జీవీఎంసీలో ప్రతి ఉద్యోగి క్రమశిక్షణ కలిగి పరిసరాల పరిశుభ్రతతో పాటు కార్యాలయం కూడా పరిశుభ్రంగా ఉండేటట్లు మంచి వాతావరణం లో విధులు నిర్వహించాలన్నారు. అందరు అధికారుల గదులలో వాష్ రూమ్ సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. పలు విభాగాల్లో ఉద్యోగులతో మాట్లాడుతూ విధుల నిర్వహణకు అనుకూలంగా గాలి, వెలుతురు కలిగి ఉన్నదీ, లేనిదీ అడిగి తెలుసుకున్నారు. కార్యాలయంలో ఉద్యోగులకు కల్పించిన మౌలిక సదుపాయాల్లో లోపాలు ఉంటే వెంటనే ఆఫీసు ఇంచార్జ్ కు తెలియపరచాలన్నారు. పలుచోట్ల ఉద్యోగులకు కల్పించిన మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేవని, వాటిని ఎప్పటికప్పుడు పరిశుభ్రపరిచేటట్టు పర్యవేక్షణ చేపట్టాలని ఆఫీస్ ఇంచార్జ్ డిఈఈ వెంకటేశ్వరరావు ను ఆదేశించారు. ప్రధాన కార్యాలయంలో ఆవరణలో నీడనిచ్చే మొక్కలను నాటాలని డిడిహెచ్ ఎం.దామోదర రావు ను ఆదేశించారు. డ్రైనేజీ వ్యవస్థ సరిచేయాలని, కార్యాలయంలో అస్తవ్యస్తంగా ఉన్న వ్యర్థాలను తొలగించి వినియోగానికి పనికిరాని వస్తువులను వేలం వేయాలని, కార్యాలయంలో పలుచోట్ల చీకటిని గమనించి విద్యుత్ బల్బులను ఏర్పాటు చేయాలని, తదుపరి తన పర్యవేక్షణకు వచ్చేటప్పటికి అన్ని సమస్యలు పరిష్కరించి కార్యాలయాల్లోని అన్ని విభాగాలలో సమస్యలు లేకుండా అందంగా తీర్చిదిద్దాలని పర్యవేక్షక ఇంజనీర్ సత్యనారాయణరాజును కమిషనర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో జీవీఎంసీ అదనపు కమిషనర్లు డాక్టర్ వై. శ్రీనివాసరావు, ఎస్. ఎస్.వర్మ, డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, ఎగ్జామినర్ వాసుదేవ రెడ్డి, కార్యదర్శి పి.నల్లనయ్య, పర్యవేక్షక ఇంజనీర్లు కే.వి.ఎన్ రవి, వినయ్ కుమార్, వేణుగోపాల్, కృష్ణారావు, యుసిడి ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంవిడి ఫణి రామ్, తదితర అధికారులు పాల్గొన్నారు.

ఢిల్లీ ధర్నాలో పాల్గొన్న వాసుపల్లి గణేష్ కుమార్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: దేశ రాజధాని న్యూ ఢిల్లీలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి విశాఖ సౌత్ మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ హాజరయ్యారు. ఏపీలో కూటమి పార్టీలు చేస్తున్న విధ్వంసానికి నిరసనగా జగన్ అధ్యక్షతన బుధవారం జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేపట్టనున్న విషయం తెల్సిందే. కార్యక్రమంలో సౌత్ కార్పొరేటర్లు, వార్డ్ ప్రెసిడెంట్ నాయకులు పాల్గొన్నారు.

జీవీఎంసీ కమీషనర్‌ను కలసిన ఈఓ

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీశ్రీశ్రీ వరాహలక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్ శ్రీనివాసమూర్తి జీవీఎంసీ కమిషనర్ పి .సంపత్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిశారు వీరికి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసచార్యులు వేద పండితులు స్వామివారి వేద ఆశీర్వచనం ఇచ్చి స్వామివారి శాలువాతో సత్కరించి ప్రసాదాలను అందజేశారు వీరితో దేవస్థానం మాజీ ధర్మకర్త గంట్ల శ్రీనుబాబు పాల్గొన్నారు.

వస్త్ర సంచుల వినియోగం పర్యావరణహితం

కోరమండల్ ఫెర్టిలైజర్స్ సామాజిక బాధ్యత స్ఫూర్తిదాయకం
- జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ నగర పర్యావరణ పరిరక్షణకు వస్త్ర సంచుల వినియోగం చాలా అవసరమని, కోరమండల్ ఫెర్టిలైజర్స్ విశాఖ నగరంలో చేస్తున్న సామాజిక సేవ స్ఫూర్తిదాయకమని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్ పేర్కొన్నారు. కోరమండల్ ఫెర్టిలైజర్స్ కంపెనీ నగర ప్రజలకు ఉచితంగా అందించేందుకు గానూ స్వచ్ఛ సర్వేక్షన్ 2024-ఎకో వైజాగ్ పేరున తయారు చేయించిన 30 వేల వస్త్ర సంచులను కమిషనర్ తన ఛాంబర్ లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముందుగా కోరమండల్ ఫెర్టిలైజర్స్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఎం. జ్ఞాన సుందరం ఇతర ప్రతినిధులు మర్యాదపూర్వకంగా జీవీఎంసీ నూతన కమిషనర్ కు పూల మొక్కను అందించి అభినందనలు తెలిపారు. నగర పర్యావరణ పరిరక్షణకై ప్రజల అవగాహన కొరకు జీవీఎంసీ సౌజన్యంతో కోరమండల్ ఫెర్టిలైజర్స్ కంపెనీ సామాజిక బాధ్యతతో పలు కార్యక్రమాలు ఎల్లప్పుడు చేపట్టడం జరుగుతుందని, ఆ దిశగా విశాఖ నగర ప్రజలకు అవగాహనపరమైన సందేశాలతో ఇప్పుడు 30 వేల వస్త్ర సంచులను ఉచితంగా అందిస్తున్నామని అందులో 15 వేల వస్త్ర సంచులు జీవీఎంసీకి అందించగా మిగిలిన 15 వేల వస్త్ర సంచులు కోరమండల్ ప్రతినిధులు మార్కెట్లో ,నివాసిత ప్రాంతాల్లో ప్రజలకు ఉచితంగా అందిస్తామని కమిషనర్ కు వైస్ ప్రెసిడెంట్ తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పరిరక్షణకు, పరిశుభ్రతకు, నగరాభివృద్ధికి ప్రజలను చైతన్య పరుస్తూ వారి అవగాహన కొరకు కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యత ఎంతో దోహదపడుతుందన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ 2024లో విశాఖ నగరం దేశంలో నే ప్రథమ స్థానం సాధన దిశగా జీవీఎంసీ యంత్రాంగం కృషి చేస్తుందని, విశాఖను పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజా సహకారమే ముఖ్య భూమికని అన్నారు. విశాఖ నగరంలో ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి చెబుతూ పర్యావరణహితమైన వస్తువులే వినియోగించే దిశగా ప్రజలను అవగాహన పరుస్తూ కోరమండల్ ఫెర్టిలైజర్స్ కంపెనీ 30 వేల వస్త్ర సంచులను నగర ప్రజలకు ఉచితంగా అందిస్తున్నందుకు ఆ కంపెనీ ప్రతినిధులకు కమిషనర్ అభినందనలు తెలుపుతూ ..., ఇతర సంస్థలకు, కంపెనీలకు స్ఫూర్తిదాయకమని వారిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కోరమండల్ ఫెర్టిలైజర్స్ కంపెనీ మాన్యూఫ్యాక్చరింగ్ హెడ్ ఆర్.శ్రీనివాసరావు, సి ఎస్ ఆర్ డిప్యూటీ మేనేజర్ ఎస్. వి.రమణ, సీనియర్ మేనేజర్ (హెచ్. ఆర్) కె .శ్రీకాంత్, పి.ఆర్ కన్సల్టెంట్ యు.ఎస్. శర్మ పాల్గొన్నారు.

మధుమేహగ్రస్తులు కంటి జాగ్రత్తలు వహించాలి

విశాలాంధ్ర - విశాఖపట్నం: మధుమేహ వ్యాధిగ్రస్తులు తమ కళ్లపాట్ల మరింత జాగ్రత్తలు వహించాలని, ఒకవేళ మధుమేహం కలిగినట్లయితే కంటి పరీక్షలు చేయించుకోవాలని ఎల్ వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్, జిఎంఆర్ వరలక్ష్మి ప్రాంగణం, విశాఖపట్నం యొక్క రెటీనా స్పెషలిస్ట్ డాక్టర్ రుద్విజ్ పాండ్యా సూచించారు. ఈ మేరకు విశాఖపట్నం ఎల్వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ లో బుధవారం జరిగిన కార్యక్రమంలో రెటీనా స్పెషలిస్ట్ డాక్టర్ రుద్విజ్ పాండ్యా మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా నున్న మధుమేహ (డయాబెటిక్స్) వ్యాధి కలిగిన వారిలో 17 శాతం మంది భారతదేశంలోనే ఉన్నారన్నారు. సుమారు 77 మిలియన్ల మంది భారతీయులు మధుమేహం తో బాధపడుతున్నట్లు గుర్తించారని, ఈ సంఖ్య 2045 నాటికి 125 మిలియన్లకు చేరవచ్చునని భావిస్తున్నారన్నారు. డయాబెటిక్ రెటినోపతి " అనేది కళ్ళను ప్రభావితం చేసే ఒక తీవ్రమైన సమస్యగా పేర్కొన్నారు. దీనికి సకాలంలో చికిత్స అందించక పోతే దృష్టిని కోల్పోవచ్చును అన్నారు. చక్కెర స్థాయి రక్తంలో ఎక్కువ కావటం వలన రెటీనా రక్త నాళాలు దెబ్బతినటం వలన కాంతిని గ్రహించే శక్తిని కోల్పోతాయన్నారు. డయాబెటిక్ రెటినోపతి అనేది ఎలాటి లక్షణాలు కనిపించకుండా వృద్ధి చెందుతుందని, ముందస్తు చికిత్స ద్వారా నివారించ వచ్చునన్నారు. డయాబెటిస్ ఉన్న వారు ప్రతి సంవత్సరం కంటి పరీక్షలు చేయించవలసి ఉంటుందన్నారు. అయితే వ్యాధి తీవ్రతను బట్టి తరచుగా కంటి పరీక్షలు చేయాల్సి ఉంటుందని,గర్భిణీలు మొదటి త్రైమాసికంలో (3వ నెలలో) సమగ్ర నేత్ర పరీక్షలు చేయించుకోవట చాల అవసరం అన్నారు. డయాబెటిక్ రెటినోపతికి ఎల్వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ లో చ ఇంట్రావిట్రియల్ ఇంజెక్షన్లు, లేజర్ ఫోటోకోగ్యులేషన్, అవసరమైతే శస్త్రచికిత్స చేసే వ్యవస్థ అందుబాటులో ఉందని తెలిపారు.

వర్షాకాలంలో జుట్టు సంరక్షణ గైడ్ పారాషూట్

విశాలాంధ్ర - విశాఖపట్నం : వర్షాకాలంలో జుట్టు సంరక్షణకు పారాషూట్ ఒక రిఫ్రెష్ బ్రేక్ అందిస్తుందనీ సంస్థ ప్రతినిధులు ప్రకటనలో తెలిపారు. గాలిలో అధిక తేమ వలన మీ జుట్టు చిట్లిపోవడం, తెగిపోయే అవకాశం ఉందన్నారు. ఈ సమయంలో, వర్షం వల్ల మీ జుట్టు మరింత దెబ్బతినకుండా కాపాడుకోవడానికి రెగ్యులర్ హెయిర్ కేర్ రొటీన్ను పాటించడం చాలా ముఖ్యమన్నారు. అనేక హెయిర్ ఆయిల్ ఎంపికలు అందుబాటులో ఉన్నప్పటికీ, మీ నిర్దిష్ట జుట్టు సమస్యల కోసం సరైన పదార్థాలు ఉన్న దాన్ని ఎంచుకోవడం చాలా ముఖ్యమన్నారు. పారాచూట్ అడ్వాన్స్డ్ అలోవెరా ఎన్రిచ్డ్ కోకోనట్ హెయిర్ ఆయిల్ అనేది అలోవెరా మరియు కొబ్బరి ఆధారిత హెయిర్ ఆయిల్ యొక్క ప్రయోజనాలను మిళితం చేసి, చిట్లిపోవటాన్ని నియంత్రించడం అలాగే మీ జుట్టును మృదువుగా చేయడంతో పాటు, వర్షాకాలంలో అత్యంత సాధారణ జుట్టు సమస్యలను కూడా ప్రభావవంతంగా పరిష్కరిస్తుందన్నారు. అలోవెరా, కొబ్బరి ఆధారిత హెయిర్ ఆయిల్ యొక్క ఈ ప్రత్యేకమైన మిశ్రమం మీ జుట్టు లోపల 10 పొరల వరకు లోతుగా చొచ్చుకుపోతుందన్నారు. ఇది మీకు కావలసిన విధంగా, అత్యంత సులభంగా మీ జుట్టును స్టైల్ చేసుకునే అవకాశాన్ని ఇస్తుందన్నారు.మీరు వారానికి 2-3 సార్లు హెయిర్ ఆయిల్ అప్లై చేయవచ్చన్నారు.

వర్షాకాలంలో తీసుకునే ఆహార పదార్థాల పట్ల జాగ్రత్త వహించాలి

విశాలాంధ్ర - విశాఖపట్నం: వర్షాకాలంలో తీసుకునే ఆహార పదార్థాలు తగిన విధంగా ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందని ప్రముఖ న్యూట్రిషనిస్ట్ డాక్టర్ రోహిణి పాటిల్ అన్నారు. బుధవారం హోటల్ లో ఆహారం ఆరోగ్యం అనే అంశంపై జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ వర్షాకాలం వాతావరణ మార్పుల కారణంగా, ప్రజలు తరచుగా డెంగ్యూ, టైఫాయిడ్, జీర్ణకోశ ఇన్ఫెక్షన్లు, శ్వాసకోశ సమస్యలు చర్మ సమస్యలు వంటి అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటారన్నారు. సమతుల్య మరియు పోషకాహారాన్ని తీసుకోవడం ఉత్తమమన్నారు. రోజువారీ భోజనంలో బాదం, తాజా పండ్లు కాలానుగుణ కూరగాయలు వంటి పోషకాలు అధికంగా ఉండే ఆహారాలను చేర్చుకోవాలన్నారు. సలహా ఇస్తున్నారు. ఈ ఆహారాలు అవసరమైన పోషకాలతో నిండి, శక్తిని పెంచడమే కాకుండా రోగనిరోధక శక్తిని సైతం బలోపేతం చేస్తాయన్నారు. ప్రతిరోజూ కొన్ని బాదంపప్పులను తీసుకోవడం వాటిలో రాగి, జింక్, ఫోలేట్ ఐరన్ వంటి 15 ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. యాపిల్స్, దానిమ్మపండ్లు, బెర్రీలు అరటిపండ్లు వంటి తాజా పండ్లలో విటమిన్లు యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయన్నారు. వెజిటబుల్ సూప్, హెర్బల్ టీ తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో, అపరిశుభ్రమైన స్ట్రీట్ ఫుడ్ నూనె లో వేయించిన వంటకాలకు దూరంగా ఉండటం చాలా అవసరమన్నారు.

మిగిలిపోయిన ఆహారం, నిల్వ ఆహారం ఎట్టి పరిస్థితుల్లో తీసుకోకూడదు అన్నారు. బచ్చలికూర, క్యాబేజీ, పాలకూర వంటి కూరగాయలను పూర్తిగా శుభ్రం చేసిన తరువాత మాత్రమే వినియోగించాలన్నారు.

ఇలా చేస్తే రోగనిధుల శక్తి పెరుగుతుందన్నారు.

నక్కపల్లి చేనేత కాలనీలో చోరీ

రంగంలోకి దిగిన పోలీసులు

విశాలాంధ్ర - నక్కపల్లి: నక్కపల్లి జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న చేనేత కాలనీలో ఉన్న ఒక ఇంటిలో బుధవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. సీఐ అంబటి విజయ కుమార్ అందించిన వివరాలలో ఉన్నాయి. కాలనీకి చెందిన కొమాకుల సత్యనారాయణ భార్యతో మూడు రోజుల కిందట కుమార్తె ఇంటికి జోగంపేట వెళ్ళాడు. వారు అటు వెళ్ళగా కుమారుడు అంజి తన భార్యతో ఆసుపత్రిలో చూపించేందుకు మంగళవారం ఉదయం అనకాపల్లి వెళ్లి అక్కడి నుంచి మాడుగులలో ఉన్న అత్తారింటికి వెళ్ళాడు. సత్యనారాయణ బుధవారం మధ్యాహ్నం ఇంటికి రాగా అప్పటికే ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారని ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని తెలిపారు. సత్యనారాయణ ఫిర్యాదులో బీరువాలో దాచి ఉంచిన రెండు తాళ్లు, ఉంగరాలు, చైను కలిపి సుమారు 7 తులాలు బంగారం ఎత్తుకుపోయారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు సీఐ చెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ అంబటి విజయకుమార్ సంఘటన స్థలానికి చేరుకుని క్షుణ్ణంగా కుటుంబ సభ్యులు వివరాలు అడిగి తెలుసుకుని దర్యాప్తు ప్రారంభించారు. అన్ని వివరాలు పూర్తిస్థాయిలో పరిశీలించి క్లూస్ టీం ద్వారా దర్యాప్తు చేస్తామని తెలిపారు. సత్యనారాయణ ఇంటి వద్ద జరిగిన సంఘటన తెలుసుకున్న టిడిపి మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, జనసేన పార్టీ నాయకులు కోసూరి నాని బాబు, బద్రి తదితరులు చేరుకొని పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

29వ వార్డులో
జోరుగా జనసేన సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీ కృష్ణ శ్రీనివాస్ ఆదేశాల్లో భాగంగా 29వ వార్డ్ జనసేన నాయకులు మన్యాల శ్రీనివాస్ అధ్యక్షతన కన్నయ్య పేటలో జోరుగా జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం సాగింది. కన్నయ్యపేటలో జనసైనికుడు అంగటి సురేష్ జోరుగా సభ్యత్వాలు చేయించారు. ఈ సందర్భంగా మన్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ జనసేన పార్టీ కార్యకర్తలు,వీర మహిళలు అందరూ కూడా సభ్యత్వం తీసుకొని భీమా సదుపాయం పొందాలని, మీ మీ ప్రాంతాల్లో వారికి సభ్యత్వ నమోదు పై అవగాహన కల్పించాలని ప్రతి జనసైనికులకు పిలుపునిచ్చారు. పార్టీ లో క్రియాశీలకంగా పని చేస్తున్న అందరికీ ఇలా భీమా సదుపాయం కల్పించడం నిజంగా హర్షించదగ్గ విషయం అని ఇంతటి మంచి అవకాశం కల్పిస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి కృతజ్ఞతలు , అభినందనలు తెలుపుతున్నానని తెలిపారు.